క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటిపాడు: విద్యుత్ 11 కేవీ రింగ్ రోడ్డు ఫీడర్ లైన్‌ల మరమ్మతుల దృష్ట్యా బుధవారం సరఫరా నిలిపి వేయనున్నట్లు గుంటూరు-2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.గురవయ్య మంగళవారం తెలిపారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు రింగ్ రోడ్, చంద్రమౌళి నగర్, తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్థిక సాయం



నగరంపాలెం: చేతి వృత్తులతో జీవించే విశ్వ బ్రాహ్మణ సంఘీయులు అనారోగ్యానికి గురైతే వారిని ఆదుకునేందుకు సంఘ పెద్దల సహకారంతో ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు పట్టణ విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కడియాల సుబ్బారావు అన్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణబాబుకాలనీ వాసి రుద్రోజు దుర్గాప్రసాద్‌కు రూ.20 వేలు, యాభై కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేశీయ విశ్వ బ్రాహ్మణ సంఘం కార్యదర్శి మేడూరి శివ రామకృష్ణ, సిద్ది సాంబశివరావు, కాకుమాను మనుబ్రహ్మాచారి, కొమ్మూరి వెంకటేశ్వరరావు, గుత్తికొండ నాగార్జున పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలి

లక్ష్మీపురం: ప్రముఖ విద్యావేత్త, ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి ఉన్న వ్యక్తి కేఎస్ లక్ష్మణరావుకు ఓటు వేసి గెలిపించాలని సీపీఐ(ఎంఎల్) రెడ్ స్టార్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కమిటీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, పొలిట్ బ్యూరో సభ్యుడు మన్నవ హరిప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో పట్టభద్రుల నియోజకవర్గ నుంచి అత్యధిక మెజార్టీతో గెలిపించిన పట్టభద్రులు మరొక్కసారి గెలిపించాలని కోరారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం

లక్ష్మీపురం: సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ బాధితుడు నుంచి రూ.1.20 లక్షలు తీసుకుని మోసం చేసిన వ్యక్తి పై మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. వసంతరాయపురానికి చెందిన గోరంట్ల మోహన్‌సాయి అనే వ్యక్తి ఆన్‌లైన్‌లో ఉద్యోగం కోసం బయోడేటా పెట్టాడు. బయోడేటాను చూసి బైరెడ్డి మధు అనే వ్యక్తి బాధితుడికి ఫోన్ చేసి ఓ ప్రైవేట్ సంస్థలో సాఫ్ట్‌వేర్ జాబ్ ఇప్పిస్తానని చెప్పి నమ్మబలికాడు. మధు మాటలను నమ్మిన సాయి అనే వ్యక్తి పలు దఫాలుగా రూ.1.20 లక్షలు నగదు ఇచ్చాడు. అయితే కాలం గడుస్తున్న ఉద్యోగం ఇప్పించకుండా కాలయాపన చేస్తున్నాడు. అనుమానం కలిగి బాధితుడు మోసం చేశాడని గ్రహించి అరండల్‌పేట పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటీపీ నమోదు చేయించి రూ.3 లక్షలు మాయం

లక్ష్మీపురం: ఆన్‌లైన్ గూగుల్ వెబ్‌సైట్ ద్వారా గ్రీజర్ మరమ్మతుల విషయమై కస్టమర్ కేర్‌కు ఫోన్ చేయగా ఓటీపీ చెప్పాల్సిందిగా కోరడంతో ఓటీపీ చెప్పడంతో ఖాతాలోని రూ.3 లక్షలు మాయం చేసిన ఘటనపై బాధితుడు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. మల్లికార్జునపేటకు చెందిన కొమెర్ల వరప్రసాద్ అనే వ్యక్తి ఈనెల 8వ తేదీన గ్రీజర్ మరమ్మతుల కోసం గూగుల్‌లో కస్టమర్ కేర్ నంబర్ కోసం వెతుకలాడాడు. గూగుల్ కస్టమర్ కేర్ నంబర్ దొరకడంతో ఫోన్ చేసి గ్రీజర్ సర్వీస్ చేయాల్సిందిగా కోరడంతో ఫిర్యాదు నమోదు చేసుకునేందుకు లింకు పంపించి లింకు తెరవగానే ఓటీపీ చెప్పాల్సిందిగా కోరాడు. వరప్రసాద్ లింక్ తెరచి ఓటీపీ చెప్పడంతో ఖాతాలో ఉన్న రూ.3 లక్షలు మాయం అయ్యాయి. దీంతో ఆన్‌లైన్ ద్వారా కస్టమర్ కేర్ నంబర్‌కు ఫోన్ చేసిన ఎలాంటి సమాధానం చెప్పక పోవడంతో బాధితుడు అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు




లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణా- గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 227, 228 , 229 పోలింగ్ స్టేషన్లను ఎన్నికల సాధారణ పరిశీలకులు వి.కరుణ మంగళవారం పరిశీలించారు. అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, జీఎంసీ అదనపు కమిషనర్ ఓబులేశు, హౌసింగ్ పీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

సంతానం పేరుతో గుల్లచేస్తున్నారు..

'ప్రకాశం జిల్లాకు చెందిన సావిత్రి, చంద్రశేఖర్‌లకు వివాహమై మూడేళ్లయినా సంతానం లేదు. ఇరువురు ఉద్యోగాలు చేస్తున్నారు. గుంటూరులోని ఓ సంతాన సాఫల్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు. సుమారు ఐదు లక్షల వరకు ఖర్చు చేసినా చికిత్స ఫెయిల్ అయింది. చికిత్స కోసం ప్రతిరోజూ ఇంజెక్షన్లు, మందులు వాడటంతో శరీరం అంతా గుల్లయింది. కనీసం కట్టిన డబ్బుల బిల్లులు ఇస్తే రీయింబర్స్‌మెంట్ ద్వారా కొంత మేరకు ఉపశమనం లభిస్తుందని దంపతులు తమకు బిల్లులు కావాలని అడిగారు. అందుకు వైద్యులు నిరాకరించారు.' ఇలా ప్రతిరోజూ జిల్లా వ్యాప్తంగా బాధితులు ఉంటున్నారు.

- చికిత్సలకు రూ.లక్షల్లో ఫీజులు
- బిల్లులు ఇచ్చేందుకు నిరాకరిస్తున్న సంతాన చికిత్స ఆస్పత్రులు
- ఆస్పత్రుల వైపు కన్నెత్తి చూడని వైద్య అధికారులు



గుంటూరు మెడికల్: అమ్మా అనే పిలుపుకోసం ప్రతి తల్లి ఎదురు చూస్తూ ఉంటుంది. పెళ్లైన ఏడాదిలోగా పండంటి బిడ్డ పుట్టకపోతే ఆ దంపతులకు ఉండే కష్టాలు మాటల్లో చెప్పలేం. సంతానం కోసం ఎన్ని రూ.లక్షలు ఖర్చు చేసైనా బిడ్డల్ని కనాలని ఎంతో మంది వ్యయ ప్రయాసలు పడుతుంటారు. దంపతులు ఆశ, బలహీనతలను ఆసరా చేసుకుని కొంత మంది సంతాన చికిత్సల పేరుతో అందిన కాడికి దోచుకుని ఇల్లు, వల్లు గుల్ల చేస్తున్నారని పలువురు బాధితులు వాపోవుతున్నారు.

నిబంధనలకు నీళ్లొదిలారు...

సంతానం లేని దంపతులకు చికిత్స అందించేందుకు జిల్లాలో 21 సంతాన సాఫల్య కేంద్రాలు జిల్లా వైద్య అధికారుల వద్ద అనుమతులు తీసుకున్నారు. ఐవీఎఫ్, ఐయూఐ, ఇక్సి, సరోగసి(అద్దె గర్భం) ద్వారా సంతానం కలిగించే చికిత్సల కోసం అనుమతి పొందారు. ఆస్పత్రుల నిర్వాహకులు ఏ చికిత్సకు ఎంత మేరకు ఫీజులు తీసుకుంటారో తెలియజేయాల్సి ఉంది. కాని ఒక్క ఆస్పత్రిలో కూడా సంతాన చికిత్సల ఫీజుల వివరాలు తెలిపేలా నోటీసు బోర్డులు లేకపోవడం, వారి ధైర్యానికి, వైద్య అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఫీజుల వివరాలు తెలియకపోవడం ద్వారా సంతాన చికిత్సలకు వచ్చిన వారు అధిక మొత్తంలో ఫీజులు చెల్లించి అనంతరం వాపోతున్నారు. కొంత మంది ఐవీఎఫ్ సెంటర్ల నిర్వాహకులు కనీసం కట్టిన ఫీజులకు బిల్లులు కూడా ఇవ్వకుండా సంతాన చికిత్సల కోసం వచ్చిన వారి జీవితాలతో ఆటాలాడుకుంటున్నారు.

కనిపించని వైద్య సౌకర్యాలు కరువు..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం సంతాన చికిత్స అందించే కేంద్రాల్లో తప్పనిసరిగా ఆండ్రాలజిస్టు, ఎంబ్రాయిలజిస్టు, గైనకాలజిస్టు, ఎనస్థటిస్ట్, కౌన్సిలర్ ఉండాలి. మైక్రోస్కోప్, సెంట్రీ ఫ్యూజ్, రిఫ్రిజిరేటర్, ఇంకిబేటర్, ల్యామినర్ ఏయిర్‌ఫ్లో, స్పెర్మ్‌కౌంటింగ్ చాంబర్, ఓపీయూఎం యాస్పిరేషన్ పంప్, టెస్ట్‌ట్యూబ్ వార్మర్, యూఎస్‌జీ మిషన్, ఏఆర్టీ బ్యాంకు ఉండాలి. కాని పలు సంతాన చికిత్స కేంద్రాల్లో నిబంధనల మేరకు వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్య పరికరాలు లేవనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. తనిఖీలకు వైద్య అధికారులు వెళ్లకపోవడంతో సంతాన సాఫల్య కేంద్ర నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ఓ ఉద్యోగి చేతిలో మామూళ్ల తంతు..

వైద్య సౌకర్యాలు పరిశీలించి వారికి అనుమతులు మంజూరు చేసే విషయంలో డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఓ ఉద్యోగి చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలున్నాయి. వైద్య అధికారులతో సంబంధం లేకుండా అంతా తానే చూసుకుంటానని, తనను లక్ష్మీప్రసన్నం చేసుకుంటే చాలంటూ సదరు ఉద్యోగి మామూళ్ల వసూలు చేస్తున్నట్లు కార్యాలయ ఉద్యోగులు చెవులు కొర్కుంటున్నారు. నిబంధనల ప్రకారం సదరు ఉద్యోగి జాబ్ చార్ట్‌లో లేని విషయాలకే అతను అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, తద్వారా భారీగా లబ్ధి పొందుతున్నట్లు విమర్శలు ఉన్నాయి.

డీఎంహెచ్ఓ ఏమన్నారంటే..

చికిత్స పొందిన అనంతరం బిల్లులు చెల్లించకపోతే చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సంతాన చికిత్సల వివరాలను తప్పనిసరిగా అందరికి కనిపించేలా నోటీసు బోర్డులో ఉంచే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రాణాపాయస్థితిలోని వ్యక్తిని బతికించారు..

- ఇన్‌ఫెక్షన్ సోకిన వ్యక్తికి ఇమ్యూనో థెరపీతో చికిత్స
- ఏపీలో మొట్టమొదటిసారిగా చేసినట్లు వైద్యుల వెల్లడి



శ్రీనివాసులుతో డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, డాక్టర్ నారాయణరెడ్డి

గుంటూరు మెడికల్: తీవ్రమైన ఇన్‌ఫెక్షన్ సోకి వెంటిలేటర్‌పై రెండు వారాలు ఉండి చనిపోయాడనుకున్న వ్యక్తిని ఆధునిక వైద్య పద్ధతిలో చికిత్స చేసి బతికించారు. ఏపీలో మొట్టమొదటిసారిగా ఇన్‌ఫెక్షన్‌తో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి ఇమ్యూనో థెరపీ చికిత్స చేసి ప్రాణాలు కాపాడినట్లు సమిష్ట హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(శ్రీ) మేనేజింగ్ డైరెక్టర్, ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ కోగంటి కళ్యాణ్‌చక్రవర్తి చెప్పారు. మంగళవారం గుంటూరు అరండల్‌పేటలోని శ్రీ హాస్పిటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన 54 ఏళ్ల కె.శ్రీనివాసులు జనవరి నెలలో స్క్రబ్ టైఫస్ బారిన పడ్డాడు. తద్వారా అతడికి ఊపిరితిత్తులు, కిడ్నీలు, గుండె బాగా దెబ్బతిన్నాయి. మెదడుకు తీవ్రమైన ఇన్‌ఫెక్షన్ సోకి ఫిట్స్ వచ్చి కోమాలోకి వెళ్లాడు. తొలుత ఒంగోలులో మూడు రోజులపాటు చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం శ్రీ హాస్పిటల్‌కు జనవరి 31న రిఫర్ చేసినట్లు డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి చెప్పారు. రోగి తమ వద్దకు వచ్చే సమయానికి బీపీ పూర్తిగా పడిపోయిందని, కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని, యూరిన్ రావడం లేదన్నారు. అంతర్జాతీయ క్లీనికల్ ట్రయల్స్‌ను అంతర్జాలంలో పరిశీలించి ఇమ్యూనో సెఫ్ ప్రొవైడ్ విధానంలో రోగికి చికిత్స అందించామన్నారు. ఫెరిటిన్ లెవల్స్ తెలుసుకునేందుకు హెలార్ లెవల్స్ పరీక్ష చేసి వ్యాధి నిరోధక శక్తిని అంచనా వేశామన్నారు. అనంతరం మాల్స్ కండీషన్‌లో రోగి ఉన్నట్లు గుర్తించి మ్యాక్రోఫేజ్ యాక్టివేషన్ లైక్ సిండ్రోమ్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారించి యాంటీ ఐఎల్1 యనకింద్ర ఇన్‌జెంక్షన్లు రోగికి చేశామన్నారు. సుమారు రెండు వారాలపాటు వెంటిలేటర్‌పై ఉన్న రోగి ఇమ్యూనో థెరపీ ద్వారా వ్యాధి నిరోధక శక్తి అంచనా వేసి చికిత్స చేయడం ద్వారా ప్రాణాలు కాపాడగలిగామన్నారు. భారత దేశంలో ఇంజెక్షన్ మార్కెట్‌లో అందుబాటులో లేదని, విదేశాల నుంచి దిగుమతి చేసుకుని చికిత్స అందించామన్నారు. ఏపీలో మొట్టమొదటిసారిగా ఇన్‌ఫెక్షన్స్‌తో బాధపడుతూ వెంటిలేటర్‌పై ఉండి ప్రాణాలపై ఆశ వదులుకున్న రోగి ఇమ్యూనో థెరపీ ద్వారా పునర్జన్మ కల్పించామన్నారు. రోగి బంధువులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ నారాయణరెడ్డి, యూరాలజిస్ట్ డాక్టర్ జ్ఞాన ప్రకాష్ పాల్గొన్నారు.

శివారు కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి

కార్పొరేషన్ కమిషనర్ శ్రీనివాసులు



అడవితక్కెళ్లపాడులో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగర శివారు ప్రాంతాల అభివృద్ధికి ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రధానంగా మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. మంగళవారం అడవితక్కెళ్లపాడు, రాజీవ్ గృహకల్ప, స్వర్ణభారతినగర్, అశోక్ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అడవితక్కెళ్లపాడు రాజీవ్ గృహకల్ప ప్రాంతాన్ని పరిశీలించి, పారిశుద్ధ్య పనులపై స్థానికుల ఫిర్యాదు మేరకు మెరుగైన చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరా, డ్రెయిన్ల సమస్యలపై ఇంజినీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అశోక్‌నగర్‌లో పలు అభివృద్ధి పనులను పరిశీలించి, పనులు జరిగే సమయంలో తప్పనిసరిగా ఎమినిటి కార్యదర్శులు అక్కడే ఉండి నిర్దేశిత ప్రమాణాలకు తగిన విధంగా పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలని చెప్పారు. అనంతరం ఆర్టీఓ కార్యాలయం దగ్గర అన్న క్యాంటీన్‌ని పరిశీలించి, క్యాంటీన్‌లో తాగునీటి సరఫరాపై ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతి రోజు డిమాండ్‌కి అనుగుణంగా ఆహారం అందుబాటులో ఉంచాలని అక్షయపాత్ర ప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో డీఈఈ శ్రీనివాస్, ఆర్ఓ రవికిరణ్ రెడ్డి, ఏసీపీ రెహ్మాన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో నాణ్యమైన విద్యనందించాలి



మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ విజయలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్యనందించాలని సమగ్రశిక్ష ఏపీసీ జి. విజయలక్ష్మి పేర్కొన్నారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు ఆరు రోజులపాటు నిర్వహించిన జ్ఞానజ్యోతి మొదటి దశ శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రైవేటు రంగంలోని ప్లే స్కూళ్లకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దేందుకు విద్యాశాఖ, మహిళా-శిశుసంక్షేమ శాఖ సంయుక్తంగా శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలపై క్షేత్రస్థాయిలో చిన్నారులను తీర్చిదిద్దడంలో ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ అబ్దుల్ ఖుద్దూస్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఎండీ ఖాసిం, డీఆర్పీలు శైలజ, అనూరాధ, పద్మలత పాల్గొన్నారు.

కె.ఎస్.లక్ష్మణరావును ఎమ్మెల్సీగా గెలిపించుకుందాం

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ



మాట్లాడుతున్న కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ

లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కె.ఎస్.లక్ష్మణరావును గెలిపించడం ద్వారా ప్రజా వాణిని శాసన మండలిలో ప్రజల గొంతుకగా వినిపించే అవకాశాన్ని పొందాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండల లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో వివిధ రంగాల ప్రముఖులు, పౌర సంఘాల నేతలు, జె.డి.ఎఫ్, సంస్థలు సంయుక్తంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరారు. గత నాలుగు దశాబ్దాలుగా సామాజిక ఆర్థిక, రాజకీయ అంశాలపై నిరంతరం కృషి చేస్తున్న లక్ష్మణరావు గెలుపు చారిత్రక అవసరమన్నారు. నిజాయితీగా నిబద్ధతతో అవినీతి రహితగా కృషి చేస్తున్న లక్ష్మణరావును గెలిపించుకోవడం మన అందరి బాధ్యత అన్నారు. అనంతరం జై ఆంధ్ర డెమోక్రటిక్ ఫోరం ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్, దళిత ఉద్యమ నేత కొరివి వినయ్‌కుమార్, సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్టర్ సేవా కుమార్, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, రాజ్యాంగ చర్చ వేదిక కన్వీనర్ అవధానుల హరి, నేస్తం వ్యవస్థాపకులు ధనుంజయరెడ్డి, తదితరులు కె.ఎస్ లక్ష్మణరావును గెలిపించేందుకు ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

భాష్యం బ్లూమ్స్‌కు ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు



ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డుతో సాకేత్‌రామ్, వరలక్ష్మి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యారంగంలో చోటు చేసుకుంటున్న మార్పులను ఆకళింపు చేసుకుంటూ నేటితరం విద్యార్థులకు ఉత్తమమైన విద్యనందించేందుకు భాష్యం బ్లూమ్స్ నిర్విరామంగా కృషి చేస్తోందని భాష్యం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్‌రామ్ అన్నారు. ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్- ఎంపవరింగ్ ఇండియా 3వ ఎడిషన్ ప్రకటించిన ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి భాష్యం బ్లూమ్స్ పాఠశాల సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్‌ను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డాక్టర్ సుకాంత మజుందార్, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌వర్మ అవార్డును ప్రదానం చేసినట్లు వివరించారు. ఈసందర్భంగా మంగళవారం చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భాష్యం బ్లూమ్స్ జెడ్ఈఓ వరలక్ష్మి, అకడమిక్ కౌన్సిల్ అడ్వైజర్ రాజా, బ్లూమ్స్ ప్రిన్సిపాల్స్ కవిత, గిరిజారాణి పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం

నెహ్రూ నగర్: నగరంలోని బీఆర్ స్టేడియం రిజర్వాయర్ పరిధిలో తాగునీటి సరఫరాకు గురు, శుక్రవారాల్లో అంతరాయం ఉంటుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత 600ఎంఎం దయా ఔట్ లేట్ ఆర్సీసీ డిస్ట్రిబ్యూషన్ పైప్ లైన్ మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం సరఫరా అనంతరం పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పనుల వలన పాత గుంటూరు, ముగ్దుం నగర్, విజయశాంతి నగర్, భగత్ సింగ్ నగర్, నాగలక్ష్మీనగర్, యానాది కాలనీ, దుర్గా నగర్, ప్రియాంక గార్డెన్స్, ఆనందపేట జీరో లైన్, జానీ మృత్యుంజయ నగర్, జానీ స్వరాజ్య నగర్, గౌడ కాలనీ, జీకే నగర్, ఎల్బీ నగర్, అలీ నగర్, అంకమ్మతల్లి గుడి రోడ్, రాములు వారి వీధి, సత్యనారాయణ స్వామి గుడి వీధి, యాదవుల బజార్, డబ్బాల సందు, పొన్నూరు రోడ్ ఎడమ ప్రాంతం, ఇసుక వాగు వీధి, ముఫ్తీ వారి వీధి, పాల హాస్పిటల్, మేకల వారి వీధి, సేవ సంగంవారి వీధి, లాల్ జాన్ బాషా షాదీ ఖానా ప్రాంతం, మంత్రివారి వీధి, సంగడిగుంట, బాబుజీ రోడ్, వడ్డే గూడెం, కబాడీ గూడెం, లాంచెస్టర్ మెయిన్ రోడ్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని వివరించారు. మార్చి ఒకటో తేదీ ఉదయం నుంచి యథావిధిగా సరఫరా జరుగుతుందని వెల్లడించారు. కావున నగర ప్రజలు తగిన ముందస్తు ఏర్పాట్లు చేసుకొని, నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు.

ఆకట్టుకున్న ఔషధ మొక్కల ప్రదర్శన



గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఔషధ మొక్కల ప్రదర్శనను నగరపాలకసంస్థ కమిషనర్ పి.శ్రీనివాసులు ప్రారంభించారు. కళాశాల కరస్పాండెంట్ దివంగత జాగర్లమూడి నరేంద్రనాథ్ జయంతి సందర్భంగా బయాలజీ, మైక్రో బయాలజీ, బయో టెక్నాలజీ, ఐక్యూఏసీ విభాగాలు సంయుక్తంగా మంగళవారం ప్రదర్శన ఏర్పాటు చేశారు. శ్రీనివాసులు మాట్లాడుతూ ఇటువంటి అరుదైన ఔషధ మొక్కల ప్రదర్శన విద్యార్థులతో పాటు సమాజంలో అందరికీ ఉపయోగకరమన్నారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ రకాల మొక్కలను తాను మొదటిసారిగా చూస్తున్నట్లు చెప్పారు. పర్యావరణ వేత్త చెలికాని సీతారామయ్య మాట్లాడుతూ మిద్దెతోటల మాదిరిగా ప్రతి ఇంట్లోనూ ఔషధ మొక్కలు పెంచాలని, రోడ్ల పక్కన. పొలాల గట్లపైనా, మురుగు కాలువల్లో ఎన్నో విలువైన మూలికా మొక్కలు ఉన్నాయని, వాటి గురించి ప్రజలకు అవగాహన ఎంతో అవసరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీ మోహన్ మాట్లాడారు. ప్రదర్శన మార్చి ఒకటో తేదీ సాయంత్రం వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో విభాగాధిపతులు కె.డేనియల్, డాక్టర్ ఎం.గురవయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సాంబశివరావు, ఐక్యూఏసీ కరిక్యులర్ యాక్టివిటీస్ వైస్ చైర్మన్ పి. నాగసుశీల, డాక్టర్ కె. సరోజ, ఎం.శ్రీలత, జీఎన్ శ్రావ్య, టి. మల్లీశ్వరి, యు.రోహిత, ఎ.అక్స, ఎన్.హారిక, కె.సౌదామిని పాల్గొన్నారు.

ఒకటి నుంచి మహా కుంభాభిషేక మహోత్సవాలు



మహోత్సవాల గోడప్రతులను ఆవిష్కరిస్తున్న మస్తానయ్య తదితరులు

నగరంపాలెం: బృందావన్‌గార్డెన్స్ శ్రీకంచి కామకోటిపీఠ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో అష్టబంధన మహా సంప్రోక్షణ సహిత మహా కుంభాభిషేక మహోత్సవాలు మార్చి ఒకటో తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పాలక మండలి అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య తెలిపారు. ఆలయ ప్రాంగణంలో మంగళవారం మహోత్సవాల గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకంచి కామకోటి పీఠాధిపతులు చంద్రశేఖరేంద్రసరస్వతిస్వామి, జయేంద్రసరస్వతి శంకరాచార్యస్వామి దివ్యస్మరణతో, శ్రీవిజయేంద్ర సరస్వతి శంకరాచార్యస్వామి దివ్య ఆశీస్సులతో శ్రీపద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి కుంభాభిషేక మహోత్సవాలను మార్చి ఒకటి నుంచి ఏడో తేదీ వరకు జరుగుతాయని అన్నారు. శ్రీపద్మావతి గోదాసమేత శ్రీవేంకటేశ్వరస్వామి 26వ వార్షిక బ్రహ్మోత్సవాలను మార్చి 11 నుంచి 14 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కుంభాభిషేకం మహోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు నిత్య పూజలు, సభా కార్యక్రమాలు, పురప్రముఖులు, ఆధ్యాత్మికవేత్తలు, పీఠాధిపతుల ప్రసంగాలు ఉంటాయని అన్నారు. కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మార్చి 2న శేష వాహన సేవ, 3న గజవాహనసేవ, 4న హనుమత్ వాహనసేవ, 5న గరుడవాహన సేవ ఉంటుందని తెలిపారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వాహకులు బొల్లేపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ మార్చి 6న మహా శాంతి అభిషేకం, శాంతి హోమం పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి 7న శ్రీస్వామి కల్యాణం, అన్నసమారాధన, ఆశీర్వచనం జరుగుతాయని అన్నారు. నోరి నారాయణ మూర్తి వ్యాఖ్యానం, ఆలయ ప్రధానార్చకులు మాధవాచారి బృందం పూజా కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని చెప్పారు. సమావేశంలో పుట్ట ప్రభాకర రావు, సత్యనారాయణ, ఉపాధ్యక్షులు లంక విజయబాబు, ఆలయ అర్చకులు మాధవాచారి పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

లక్ష్మీపురం: ఉచితాలు అనుచితం, సబ్సిడీలు, సంక్షేమ పథకాల వలన వ్యవసాయ కార్మికులు సోమరిపోతులు అవుతున్నారని వ్యాఖ్యలు చేసిన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో మంగవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధక్షుడు తన్నీరు ప్రభుదాసు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులను ఈ విధంగా మాట్లాడటం చాలా బాధాకరమని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు మాట్లాడారు.

శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైన మల్లికార్జునుడు



ముస్తాబైన శివాలయం



గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని శ్రీగంగా భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి వారి దేవస్థానంలో మహా శివరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. మంగళవారం సాయంత్రం త్రయాహ్నిక దీక్షతో ప్రారంభించి ధ్వజారోహణ, కలశస్థాపన, గణపతిపూజ ఘనంగా నిర్వహించారు. స్వామివారు, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. బుధవారం తెల్లవారుజాము నుంచి విశేష అబిషేకాలను నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకస్వామి చంద్రశేఖర శర్మ తెలిపారు. మూడు రోజులపాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణాన్ని శోభాయమానంగా అలంకరించారు.



విశేష అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

